నందనవనాలుగా శ్మశానవాటికలు

జీవీఎంసీ 1, 2 వార్డులో రూ.1.09 కోట్లతో అభివృద్ధి

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్‌లో శ్మశానవాటికలు నందనవనాలుగా రూపుదిద్దుకున్నాయి. అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా ఇటీవల రూ.1.09 కోట్లతో 1, 2 వార్డుల్లోని నమ్మివానిపేట, సంగివలస, చిల్లపేట, సంతపేట క్రిస్టియన్ శ్మశానవాటికలను ప్రభుత్వం నందనవనాలుగా తీర్చిదిద్దింది. ముఖ్యంగా శ్మశానవాటికల స్థలాలు కబ్జాకు గురి కాకుండా ప్రహరీలు నిర్మించారు. వర్షాకాలంలో ముంపునకు గురి కాకుండా ఎత్తు చేయించారు. అంతిమయాత్ర సమయంలో తరలి వచ్చేవారికి షెల్టర్లు, బోరుబావులు, మృతదేహాలను దహనం చేయడానికి షెడ్లు, కూర్చోవడానికి బెంచీలు తయారు చేశారు. లోపల నడిచేందుకు కాంక్రీట్ బాటలు నిర్మిస్తున్నారు. అంతేకాకుండా నీడ కల్పించేందుకు కొబ్బరి, మామిడి, బాదం తదితర మొక్కలు నాటుతున్నారు. మొత్తం మీద శ్మశానవాటిక పేరు చెపితే జుగుప్స కలిగించే వాతావరణం నుంచి సేద తీర్చే పార్కులుగా తీర్చిదిద్దుతున్నారు.

గతంలో అడుగు పెట్టలేని పరిస్థితి

గత ప్రభుత్వాల హయాంలో శ్మశానవాటికలు మృతదేహాలపై కప్పే వస్త్రాలు, మంచాలు, తుప్పలు, విష పురుగులతో నిండి ఉండేవి. చనిపోయిన వారి వెంట వచ్చే ఆప్తులు ఇక్కడి జగుప్సాకర వాతావరణం చూసి లోపలికి అడుగు పెట్టేందుకు సాహసం కూడా చేసేవారు కాదు. తప్పనిసరి పరిస్థితుల్లో వర్షాకాలంలో తడుస్తూ, ఎండాకాలంలో ఎండుతూ, సాయంత్రమైతే చీకట్లోనే పాల్గొనే బంధువులు వసతుల లేమి కారణంగా మరింతగా దుఃఖించేవారు. ఎవరైనా దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు వస్తే ఏడాదికో, ఆరుమాసాలకో ఒకసారి క్లీనింగ్ చేయించేవారు. టీడీపీ హయాంలో శ్మశానవాటికల అభివృద్ధి కంటే వాటి అభివృద్ధి పేరుతో మంజూరయ్యే నిధులు కాజేసే సంఘటనలే భీమిలి జోన్‌లో ఎక్కువగా జరిగాయి. ప్రస్తుతం వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నిధుల మంజూరు చేయడంతోపాటు పరిపూర్ణంగా నాణ్యతతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి.

- జీవీఎంసీ ఒకటో వార్డు సంతపేట క్రిస్టియన్ శ్మశానవాటికలో రూ.15 లక్షలతో అభివృద్ధి పనులు ముగిశాయి.
- జీవీఎంసీ రెండో వార్డు నమ్మివానిపేటలో రూ.27 లక్షలతో అభివృద్ధి పనులు చేశారు.
- జీవీఎంసీ రెండో వార్డు గల్లీరోడ్డు చిల్లపేట శ్మశానవాటికలో రూ.42 లక్షలతో అభివృద్ధి పనులు ముగింపుదశలో ఉన్నాయి.
- జీవీఎంసీ రెండో వార్డు సంగివలసలో రూ.25 లక్షలతో అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి.



ప్రహరీ నిర్మాణం పూర్తయిన సంతపేట క్రిస్టియన్ శ్మశానవాటిక


సంతపేట లండన్ మిషన్ చర్చి శ్మశానవాటిక


నమ్మివానిపేట శ్మశానవాటిక ప్రహరీ


చిల్లపేట శ్మశానవాటికలో కొబ్బరి మొక్కలు

అభివృద్ధి ఘనత సీఎం జగన్‌దే



శ్మశానవాటికల అభివృద్ధి గతంలో ఏ ప్రభుత్వమూ చేపట్టలేదు. అందరికీ అవసరమే అయినా కనీసం శుభ్రం కూడా చేయించేవారు కాదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చొరవతో శ్మశానవాటికలు పార్కుల్లా సుందరంగా ముస్తాబయ్యాయి.

– చిల్ల భాస్కరరెడ్డి, చిల్లపేట

మైనారిటీలకు ప్రత్యేకంగా...



మైనారిటీల శ్మశానవాటికలకు ఏ ప్రభుత్వమూ ప్రాధాన్యమివ్వలేదు. అలాంటిది సీఎం వైఎస్ జగన్ గతంలో స్థలాలు కేటాయించారు. ఇప్పుడు సంతపేటలో నిధులు మంజూరు చేసి అభివృద్ధి చేయించారు. సీఎం జగన్ పాలనలోనే అభివృద్ధి సాధ్యం.

– పెనుమాక జాన్‌ఛార్లీ, కొత్తపేట

అభివృద్ధి చూసి టీడీపీ నుంచి వచ్చాం



వైఎస్ జగన్ సీఎం అయిన తర్వాత జరుగుతున్న అభివృద్ధిని చూసి మా గ్రామస్తులమంతా వైఎస్సార్‌సీపీలో చేరిపోయాం. ఇప్పుడు శ్మశానవాటికకు రహదారి, ప్రహరీ, గ్రామంలో డ్రైనేజీలు, సీసీ రోడ్లు నిర్మించారు. సంక్షేమంలో కూడా అధిక ప్రాధాన్యత కల్పించారు.

– నమ్మి మాధవరావు, నమ్మివానిపేట

నిరంతరం అభివృద్ధి, సంక్షేమం



వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత కోవిడ్ లాంటి మహమ్మారులు కోరలు చాచినా అభివృద్ధి, సంక్షేమ పథకాలను విరామం లేకుండా అమలు చేస్తున్నారు. డబ్బులు పంచుతున్నాడనే అభియోగాలు తప్ప ప్రతిపక్షాల విమర్శలలో ఎలాంటి పస లేదు. వాళ్లు ప్రజల విశ్వాసం కోల్పోయారు.

– జోసెఫ్ జేమ్స్, చిట్టివలస

రక్తహీనతపై అవగాహన అవసరం

తగరపువలస: ప్రపంచ రక్తహీనత అవగాహన దినోత్సవం సందర్భంగా సంగివలస అనిల్ నీరుకొండ ఆస్పత్రి వైద్యులు చిన్నారులకు అవగాహన కల్పించారు. భీమిలి మండలం తాళ్లవలసలోని లిటిల్ హగ్స్ బాలల సంరక్షణ కేంద్రంలో వైద్యులు ప్రతిమాదేవి, రామభద్రరాజు, జగన్నాథ్ కార్తీక్ మంగళవారం మాట్లాడారు. రక్తహీనత నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మెరుగుపడేందుకు తీసుకోవలసిన ఆహార పదార్థాలు వివరించారు. అనంతరం విద్యార్థులకు రక్తపరీక్షలు నిర్వహించి పౌష్టికాహారం అందించారు.

దివ్యాంగుల ఉపకరణాల పరిశీలన


బక్కన్నపాలెంలో ఉపకరణాలు పరిశీలిస్తున్న ఎంపీ జీవీఎల్ నరసింహారావు, తదితరులు

మధురవాడ : బక్కన్నపాలెం వయోవృద్ధుల, దివ్యాంగుల ఐటీఐలో పంపిణీకి సిద్ధంగా వున్న దివ్యాంగుల ఉపకరణాలను ఎంపీ జీవీఎల్ నరసింహారావు మంగళవారం పరిశీలించారు. జిల్లా యంత్రాంగం, కేంద్ర ప్రభుత్వ సంస్థ అలీమ్‌కో సహకారంతో నిర్వహించిన గుర్తింపు శిబిరాల్లో లబ్ధిదారులకు ఈ నెల 15న డీఎల్‌బీ గ్రౌండ్‌లో వీటిని పంపిణీ చేయనున్నారు. రూ.2.50 కోట్ల విలువైన ఉపకరణాలు, 282 బ్యాటరీ మూడు చక్రాల బండ్లు, 169 ట్రై సైకిళ్లు, 213 చైర్‌లు, క్లచ్‌లు, 445 చెవి వినికిడి యంత్రాలు, 869 చేతికర్రలు, బ్లైండ్ స్టిక్స్ 1600 మందికి పంపిణీ చేయనున్న నేపథ్యంలో వీటిని ఆయన పరిశీలించారు.

క్లుప్తంగా

పేదల సంక్షేమానికి కృషి


కురపల్లిలో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు

పద్మనాభం: పేదల సంక్షేమమే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం పని చేస్తోందని రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు అన్నారు. మండలంలోని కురపల్లి, తునివలస, విజయానందపురం, పెంట, అనంతవరం గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన 'పల్లెకు పోదాం' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడమే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆశయమన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు పనులు కల్పిస్తుందన్నారు. ఈ సందర్భంగా ఆయన పద్మనాభంలోని కుంతీ మాధవ స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ వైద్య విభాగం రాష్ట్ర కన్వీనర్ రూపాకుల రవికుమార్, నాయకులు వంశీ, రెడ్డిపల్లి శ్రీను, పేర్రాజు పాల్గొన్నారు.

'ఇన్‌స్పైర్ మనక్'లో 200 ప్రాజెక్టుల ఎంపిక

విశాఖ విద్య: ఇన్‌స్పైర్ మనక్ పోటీల్లో ఉమ్మడి విశాఖ జిల్లా విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. కేంద్ర ప్రభుత్వ శాస్త్ర, సాంకేతిక విభాగం మంగళవారం ప్రకటించిన ఫలితాల్లో 200 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఒక్కో విద్యార్థి రూ.10 వేలు ప్రోత్సాహకం అందుకోనున్నారు. ఎంపికైన విద్యార్థుల జాబితాను జిల్లాల వారీగా సిద్ధం చేసి, కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన నగదు ప్రోత్సాహకం అందించేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

సామాజిక అంశాలే ప్రధానం

మినిస్ట్రీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ సంయుక్త ఆధ్వర్యంలో ప్రతీ ఏటా పాఠశాల స్థాయిలో 'ఇన్‌స్పైర్ మనక్' పేరిట విద్యార్థుల్లో సృజనాత్మకతపై పోటీలను నిర్వహిస్తోంది. సామాజిక అంశాలు, సమాజాభివృద్ధికి దోహదపడే వినూత్నమైన ఆలోచనలకు రూపం ఇచ్చేలా ఎలాంటి ప్రాజెక్టులను తయారు చేస్తామనే అంశంపై విద్యార్థులు తమ ఐడియాను నమోదు చేయాల్సి ఉంటుంది. ఇలా ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి 2023–24 విద్యా సంవత్సరానికి 2,680 మంది పేర్లు నమోదు చేసుకోగా, ఇందులో 200 మంది ఎంపికయ్యారు. విద్యార్థులు తమకు అందిన రూ.10 వేల నగదు ప్రోత్సాహకాన్ని వినియోగించుకుని, ప్రాజెక్టుకు అవసరమయ్యే సామగ్రిని సమకూర్చుకోవాల్సి ఉంటుంది. ఈ సందర్భంగా జిల్లా సైన్స్ అధికారి కె.ప్రసాద్ మాట్లాడుతూ ఎంపికైన విద్యార్థుల పేర్లతో బ్యాంక్ అకౌంట్ తెరవాలని సూచించారు. దీనిపై ఆయా పాఠశాలల సైన్స్ ఉపాధ్యాయులు శ్రద్ధ తీసుకోవాలన్నారు.

కుసులువాడ ఎంపీటీసీ మాజీ సభ్యుడు మృతి



ఆనందపురం : మండలంలోని కుసులువాడ ఎంపీటీసీ మాజీ సభ్యుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు షిణగం గుర్నాథరావు (74) సోమవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్, పార్టీ మండల అధ్యక్షుడు బంక సత్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు తదితరులు మంగళవారం గుర్నాథరావు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. గుర్నాథరావుకి భార్య, నలుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

రేపు జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్

విశాఖ విద్య: జిల్లా స్థాయి సైన్సు ఫెయిర్ ఈ నెల 15న నిర్వహించనున్నట్టు జిల్లా సైన్సు అధికారి కె. ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో గాజువాక కణితి రోడ్‌లోని ఎస్ఎఫ్ఎస్ స్కూల్ వేదికగా నిర్వహిస్తున్న ప్రదర్శనకు జిల్లాలో 65 ప్రాజెక్టులు ఎంపికైనట్టు పేర్కొన్నారు. జిల్లా స్థాయికి ఎంపికైన ప్రాజెక్టులతో విద్యార్థులు, సైన్సు ఉపాధ్యాయులు సకాలంలో హాజరు కావాలని ఆయన సూచించారు. జిల్లా స్థాయిలో ఉత్తమంగా నిలిచిన ఏడు ప్రాజెక్టులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

'తిరుమల' విద్యార్థుల సత్తా


ప్రతిభ చూపిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

తగరపువలస : ఈ ఏడాది జనవరిలో కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన జేఈఈ మెయిన్స్ పరీక్షల్లో తమ విద్యార్థులు సత్తా చాటారని భీమిలి మండలం తాళ్లవలస తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. జక్కా వెంకట సాయితేజ 99.96, కర్రి ఉర్జిత్ కార్తికేయ 99.94, పొడుగు రాహులు 99.92, పీలా షణ్ముఖ సాయినాథ్ 99.90, కొడవటి శ్రీసాయి మహి ప్రణీత్ 99.85, భీశెట్టి హేమస్వరూప్ 99.81, తెర్లి శశాంక్ 99.74, బోగి హర్ష నాగవర్ధన్, తెర్లి ఉమా సాయి దీపక్ 99.71, పెంటపల్లి రోహిత్‌సాయి 99.60, బండి జ్యోత్స్న 99.52, గండ్రెడ్డి హిమాచల్ 99.51, నూక అవినాష్ 99.49, తంగుడు దీపక్ 99.45, రాజాపు ప్రవీణ్‌నాయుడు 99.43, పెదిరెడ్ల ఖ్యాతి కిరణ్ 99.40, గంటా దిలీప్ నాయుడు 99.32, ఈపక్ కుమార్ గౌడ 99.27, బెవర జగన్, వంటాకు జగన్‌లు 99.14, కొయ్యాన రామలీల సాయి 99.11, దండి రామ నవదీప్ కుమార్ 99.02 పర్సంటైల్ సాధించారని తెలిపారు. నలుగురు విద్యార్థులు 99.90కుపైగా, 12 మంది 99.50కు పైగా, 22 మంది 99కు పైగా, 39 మంది 98కు పైగా, 60 మంది 97కు పైగా, 81 మంది 96కు పైగా, 92 మంది 95కు పైగా, 172 మంది 90కు పైగా, 331 మంది 80కు పైగా పర్సంటైల్ సాధించారన్నారు. ఈ సందర్భంగా వీరిని రెసిడెంట్ డైరెక్టర్లు ఇ.మృత్యుంజయరావు, కె.ఎస్.వి.వి.సత్యనారాయణ, ఎం.సత్యనారాయణ, జి.సతీష్‌బాబు అభినందించారు.

అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ

తగరపువలస : జీవీఎంసీ ఒకటో వార్డు సంతపేట కొత్తమ్మ తల్లిని మంగళవారం రాయల్ రెడ్డీస్ యూత్ ఆధ్వర్యంలో బంతి, చామంతి పూలదండలతో అలంకరించారు. ఈ అలంకరణకు సంతపేట గొల్లవీధికి చెందిన దుక్క వెంకట అప్పారావు, వెంకటి, కొత్తపేటకు చెందిన గ్రామీణ వైద్యుడు మంగా శివప్రసాద్ సహాయ సహకారాలు అందించారు. ఈ అలంకరణకు భీమిలి మండలం చిప్పాడకు చెందిన సాడి కుమార్, తాళ్లవలసకు చెందిన బోని ఈశ్వరరావు, సంతపేటకు చెందిన దుంప శంకరరావు సహకరించారు.

- భీమిలి మండలం మజ్జివలస రాస పోలమాంబ అమ్మవారిని మహిళా వ్యవసాయ రైతులు పిన్నింటి రాజమ్మ, చిట్టెమ్మ, బట్టు బంగారమ్మ, కాగితాల అంకమ్మ, వెంపాడ నారాయణమ్మ, బట్టు పార్వతి, కాగితాల గౌరి అరిసెలు, పాకుండలతో అలంకరించారు. అలాగే తాటితూరు పైడితల్లమ్మను స్థానికులు అలంకరించారు.


బంతి, చామంతి పూలదండలతో సంతపేట కొత్తమ్మతల్లి


అరిసెలు, పాకుండలతో మజ్జివలస రాస పోలమాంబ


తాటితూరు పైడితల్లమ్మ

ఘనంగా ఆలయాల వార్షికోత్సవం


విగ్రహాలను పల్లకిలో ఊరేగిస్తున్న వలందపేట గ్రామస్తులు

తగరపువలస : జీవీఎంసీ రెండో వార్డు వలందపేటకు చెందిన విద్యా గణపతి సహిత అయ్యప్ప స్వామి, సుబ్రహ్మణ్యస్వామి ఆలయాల 12వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రధానార్చకుడు మధు ఆధ్వర్యంలో ఆలయంలో అభిషేకాలు, అర్చనలు, విశేష హోమాలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ విగ్రహాలతో పల్లకీ సేవ నిర్వహించారు. మహిళలు కలశాలతో ఊరేగింపులో పాల్గొన్నారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. వేడుకల్లో చిల్ల సూర్యనారాయణ రెడ్డి, నగిరెడ్ల రాంబాబు, కంబపు దుర్గా రెడ్డి, చిల్ల గోపాల్, బోయి అప్పలరెడ్డి, వెంకటరావు, చిల్ల సూరిదాసు, శిల్లా కరుణాకర రెడ్డి, డెక్కతి శివ, ఎరుసు అప్పారావు, చిల్ల అప్పల రెడ్డి, మొక్క శ్రీను, కొసన శ్రీనివాస రెడ్డి, సరగడ శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తాపడి ఇద్దరికి గాయాలు

తగరపువలస : భీమిలి మండలం దాకమర్రి రఘు ఇంజినీరింగ్ కళాశాల వద్ద మంగళవారం ఆటో బోల్తా పడిన సంఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. గుర్తు తెలియని వ్యక్తి రోడ్డు దాటుతుండగా తప్పించబోయి విజయనగరం వైపు వెళ్తున్న ఆటో మూడు పల్టీలు కొట్టి రోడ్డు పక్కన కాలువలో పడిపోయింది.

ఈ ప్రమాదంలో రఘు ఇంజినీరింగ్ కళాశాలలో మూడో సంవత్సరం చదువుతున్న మెకానికల్ ఇంజినీరింగ్ విద్యార్థి మొల్లేటి యశ్వంత్ సాయి తీవ్రంగా గాయపడ్డాడు. ఇతనిది గాజువాక వద్ద శ్రీహరిపురం సమీప పవన్‌పుత్ర నగర్. ఆటోలో ఉన్న మరో మహిళకు మణికట్టు వద్ద గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం సంగివలస అనిల్ నీరుకొండ జనరల్ ఆస్పత్రికి తరలించారు.

ఈ – క్రాప్ నమోదు తప్పనిసరి


గొట్టిపల్లిలో ఈ – క్రాప్ నమోదు పరిశీలిస్తున్న జగ్గారావు, తదితరులు

ఆనందపురం : రైతులు వేసిన పంటలకు ఈ – క్రాప్ నమోదు తప్పనిసరిగా చేయాలని వ్యవసాయశాఖ ప్రణాళికా విభాగం ఉప సంచాలకుడు ఎం.జగ్గారావు సూచించారు. మంగళవారం ఆయన మండలంలోని వేములవలస రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించడంతోపాటు గొట్టిపల్లిలో ఈ – క్రాప్ నమోదుని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు రైతు భరోసా సాయం అందాలన్నా, విత్తనాలు కావాలన్నా పండిన పంటను విక్రయించుకోవాలన్నా ఈ – క్రాప్ నమోదు చేసి రైతులకు ఈకేవైసీ తప్పనిసరిగా చేయాలన్నారు. అనంతరం పొలంలో వేసిన పంట రకాలు, ఈ – క్రాప్‌లో నమోదు చేసిన పంట వివరాలతో సరిపోల్చారు. రైతు భరోసా కేంద్రం నిర్వహణను పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో భీమిలి డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకుడు బి.విజయ్ ప్రసాద్, వ్యవసాయాధికారి సంధ్యారత్నప్రభ, రైతులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా అందజేత


నారాయణమ్మకు బీమా సొమ్ము అందిస్తున్న ఎంపీపీ వాసురాజు

తగరపువలస: భీమిలి మండలం టి.నగరపాలెం పంచాయతీకి చెందిన పోలిపల్లి నారాయణమ్మకు వైఎస్సార్ బీమా పథకం కింద ఎంపీపీ దంతులూరి వాసురాజు రూ.90 వేల విలువైన మంజూరు పత్రం మంగళవారం అందించారు. ఇటీవల ఆమె భర్త రామకృష్ణ చనిపోవడంతో బీమా సొమ్ములో భాగంగా అప్పట్లో తక్షణ సాయంగా రూ.10 వేలు చెల్లించారు. మిగిలిన సొమ్ము ఆమె బ్యాంకు ఖాతాలో క్రెడిట్ కాగా ఆ వివరాలతో కూడిన పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ పొట్నూరు ఛాయాగౌతమి, ఎంపీటీసీ సభ్యురాలు పల్లా నీలిమ, వార్డు సభ్యులు తమ్మిన నరేంద్ర, పోలిపల్లి చిన్నరమణ, వైఎస్సార్‌సీపీ నాయకులు పొట్నూరు చంద్రశేఖర్, పల్లా సన్యాసిరావు, రాజగిరి రామచంద్రరావు, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాముడి హృదయానంద స్వరూపం 'హనుమంతుడు'


ప్రవచనాలు చెబుతున్న షణ్ముఖ శర్మ


హనుమత్ వ్రతంలో పాల్గొన్న భక్తులు

ప్రముఖ ప్రవచనకర్త సామవేదం షణ్ముఖ శర్మ

ఎంవీపీ కాలనీ: శ్రీరాముడి హృదయానంద స్వరూపం హనుమంతుడు అని ప్రముఖ ప్రవచనకర్త సామవేదం షణ్ముఖ శర్మ అన్నారు. హనుమద్వైభవ ప్రవచనాలు ఎంవీపీ కాలనీలో మంగళవారం కొనసాగాయి. ఎంవీపీ కాలనీలోని ఏబీసీ పార్కు వేదికగా షణ్ముఖ శర్మ హనుమాన్ చాలీసా వ్యాఖ్యానంతో హనుమద్వైభవ ప్రవచనాలు కొన్ని రోజులుగా కేవీఎస్ శ్యామ్, అరుణ గాయత్రి దంపతుల ఆధ్వర్యంలో కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా షణ్ముఖశర్మ మాట్లాడుతూ మనోనిబ్బరానికి నిలువెత్తు నిదర్శనంగా, వేదాంత విద్యను ఎరిగిన వాడిగా, జ్ఞానంతో ఉన్నత విలువలు కలిగిన వాడిగా హనుమాన్ ప్రసిద్ధి చెందాడన్నారు. రాగ, ద్వేషాలకు అతీతంగా కర్తవ్యాన్ని ఆచరించగల సమర్థత ఆయన సొంతమన్నారు. శ్రీరాముడి కార్యాచరణలో హనుమంతుని పాత్ర ప్రత్యేకమన్నారు. ప్రపంచంలోని అరుదైన అద్భుత ఔషధాలు ఆయుర్వేదం రూపంలో మన దేశంలో ఉన్నాయన్నారు. సంజీవని పర్వతాన్ని తెచ్చి లక్ష్మణుడికి ప్రాణదానం చేసిన కర్త వ్యసాధకునిగా హనుమంతుడు నిలిచారన్నారు. కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన హనుమత్ వ్రతంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. మంగళవారం సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రవచనాలు అనంతరం భక్తులు షణ్ముఖ శర్మ ఆశీస్సులు తీసుకున్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష' శిబిరం నేడు

తగరపువలస : జీవీఎంసీ భీమిలి జోన్ బొగ్గురోడ్డు – 3 సచివాలయం పరిధిలోని ప్రజలకు బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించనున్నారు. శ్రీనగర్ కమ్యూనిటీ హాలులో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం వరకు నిర్వహించే శిబిరాన్ని స్థానికులు వినియోగించుకోవాలని జెడ్సీ శైలజవల్లి కోరారు.

విజయవంతంగా 'జగనన్న సురక్ష' శిబిరాలు

మహారాణిపేట: రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు విజయవంతంగా కొనసాగుతున్నాయి. మంగళవారం భీమిలి మండలం పొట్నూరు, పద్మనాభం మండలం రేవిడి, ఆనందపురం మండలం గంభీరం గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ శిబిరాలను డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు సందర్శించి పలు సూచనలు చేశారు. ఈ శిబిరాల్లో మొత్తం 1,515 మంది రోగులు పేర్లు నమోదు చేసుకోగా.. ఉచిత వైద్య సేవలు అందించారు. అవసరమైన మందులు అందజేశారు. పలువురికి నేత్ర పరీక్షలు చేశారు. కంటి శుక్లాలను గుర్తించి ఉచితంగా ఆపరేషన్ చేసి కళ్లద్దాలు ఇవ్వాలని నిర్ణయించారు. ఆరుగురిని మెరుగైన వైద్యం కోసం కార్పొరేట్ ఆస్పత్రులకు రిఫరల్ చేశారు.

నేడు 12 ప్రాంతాల్లో శిబిరాలు

నగర పరిధిలో 12 ప్రాంతాల్లో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహించనున్నారు. ఆదర్శనగర్, పురుషోత్తపురం, చంద్రనగర్, న్యూగాజువాక, గిరిజా కాలనీ, బాపూజీనగర్, అంబేడ్కర్‌నగర్, ఏపీ స్‌ఆర్ నగర్, కొబ్బరితోట, లాసన్స్‌బే కాలనీ, బక్కన్నపాలెం, బాలాజీనగర్‌లలో ఈ వైద్య శిబిరాలు జరుగుతాయని డీఎంహెచ్‌వో తెలిపారు.